


# స్వయంవరం

—పీసపాటి చంద్రశేఖర్

సన్నగా కాలి అందెల సవ్వడి విని పించింది.

సీతారామం గుండె చిన్నగా కంపించింది.

ఆ శబ్దం వచ్చిన వైపు చూశాడు. అతని కంటికి పచ్చని పాదాలు కని పించాయి.

అతని గుండె స్పీడు హెచ్చింది. పాదాల మీంచి పైకి చిలకాకు పచ్చ రంగు పట్టుచీర ఎగ్రబాకి ఆమె గుండెల్ని చుట్టుకొని భుజం మీదుగా ప్రేలాడు తోంది. మహావిష్ణువు చేతిలోని శంఖంలాంటి మెడ; ఆ పైన సిగ్గుతో బరువెక్కి కిందికి వాలిన కళ్ళతో చక్కటి చంద్ర వదనం అతని కంటపడ్డాయి.

ఆమె అందం చిమ్మిన మత్తులో పడి క్షణ కాలం లోకాన్ని మరచిపోయాడు సీతారామం.

ఆమె మందాకినిలా కదలివచ్చి అతని కెదురుగా పరచిన అందమైన తివాచీపై కూర్చుని దానికి మరింత అందాన్నిచ్చింది.

సీతారామం మత్తు విడి ఆమెను ఒక్కసారి పరి కించి చూశాడు. అతనికి వెన్నులో సన్నగా షాక్ తగిలింది.

''ఈమెను ఎక్కడో చూశానే!'' అనుకొంటూ గతాన్ని తన మెదడు అరలలోంచి ఒక్కసారి సవరిం చాడు.

''అలా బొమ్మల్లా కూర్చుండిపోయారేవిట్రా! ఒకళ్ళ నొకళ్ళు చూసుకోండి'' అంటూ సీతారామం తండ్రి గుబురు మీసాల చాటు నుండి చిరునవ్వులు కురిపించాడు.

''నువ్వు కూడా అబ్బాయి నొకసారి చూడు తల్లీ'' అన్నాడు అమ్మాయి తండ్రి.

ఇద్దరి చూపులూ కలిశాయి.

ఇద్దరి బుర్రల్లోనూ ఒకేసారి మెరుపు మెరిసింది.

''అదే ముఖం! అవే చురకత్తి లాంటి చూపులు! ఈమె ఆమే!''

''అదే మనిషి! అదే అందమైన మీసకట్టు! ఇతను అతడే!''

* * *

అవి సీతారామం కాలేజిలో చదువుకునే రోజులు. తన ఊర్లో కాలేజీ లేకపోవడంతో తన మేనమామగారి ఊర్లో చదువుకొనసాగించవలసి వచ్చింది.

కాలేజి చదువు మొదలయిన కొద్ది రోజులకే సీతారామం కష్టాలు కూడా మొదలయ్యాయి.

అతను కాలేజీకి వెళ్ళాలంటే ఒకే దారి వుంది. ఆ దారిలో అతని కెదురయిన పెద్ద అడ్డంకి ఆడపిల్లల కాలేజి. ఆ కాలేజి ముందు నుంచే మగపిల్లలంతా తమ కాలేజీకి వెళ్ళాల్సి వుంటుంది.

సీతారామాన్ని రోజూ నలుగురమ్మాయిలు దారి కాచి ఆట పట్టించేవారు. వాళ్ళ కాలేజి గేటు దాకా అతడిని వెంటాడి వెంటాడి ఏడ్పించేవారు.

వాళ్ళను ఎలాగ తప్పించుకోవాలో అర్థంకాక వెర్రెత్తిపోయేదతనికి. ఏ సమయానికి తను బయ ల్దేరినా వాళ్ళతని కోసం సిద్ధంగా వుండేవారు.

''నీ పేరేవిటి బాబూ!'' అంటూ వెంటపడేదొక అమ్మాయి.

సీతారామం మాట్లాడకుండా గబగబా వెళ్ళిపోటా నికి ప్రయత్నించేవాడు.

''నేను చెప్పాను కదే! ఈ అబ్బాయికి మాటలు రావనీ, మూగవాడనీ!'' అనేది మరొక అమ్మాయి.

మువ్వలు రవళించినట్టు అంతా గలగల నవ్వే వారు.

''చూడు మూగబ్బాయ్! నీవి పాల బుగ్గలంటాను నేను; కాదంటుంది నా ఫ్రెండ్. అవునో కాదో తేల్చుకోవాలనుంది. నీకేమైనా అభ్యంతరమా?''

''చూడు బాబూ! నీ మీసకట్టు అంటించుకున్న దని నేనూ, కాదు నిజంగానే మొలిచినదని నా ఫ్రెండ్ పందెం వేసుకున్నాం. నీది నిజం మీసకట్టో లేక మోసకట్టో తెలుసుకోడానికి లాగి చూడనా?''

''నీ కళ్ళల్లో కళ్ళు పెట్టి మా కంట్లో కాటుక దిద్దుకోవచ్చంటుంది నా ఫ్రెండ్. ఒక్కసారి ట్రై చెయ్యనా?''

ఇలా యిష్టం వచ్చినట్టు ఏడ్పించేవారు అమ్మా యిలు.

ఒక రోజు తన మేనత్తతో తన గోడు చెప్పకుని గోలపెట్టాడు సీతారామం. 'ఆడపిల్లలు మగపిల్లల్ని అల్లరి పెట్టడమేమిట్రా చిత్రంగాను!' అంటూ ఆశ్చర్యపోయిందావిడ. 'ఐ సా భీ హోతా హై' అంటూ ఆమె ఆశ్చర్యాన్ని తన చుట్ట పొగతోబాటు వూదేశాడు సీతారామం మేనమామ.

ఇలా లాభం లేదని గ్రహించాడు. తన కెలాగూ ధైర్యం లేదు. మగాడితోనే చనువు తీసుకొని మాట్లాడలేని మొహమాటం తనది. అందుకని తన కాలేజీలో చాలా పలుకుబడి వున్న సింహంతో ఒప్పందానికొచ్చాడు. సింహం టీ, కాఫీ ఖర్చులు సీతారామం భరిస్తే అమ్మాయిల బారి నుండి అతడ్ని సింహం కాపాడాలని ఒప్పందం.

సింహం దయవల్ల అమ్మాయిల బెడద తప్పింది. సింహంతోబాటు కాలేజీకి వెళ్తున్న సీతారామాన్ని ఆపే ధైర్యం లేకపోయేది అమ్మాయిలకి.

కాని మరో కొత్త బాధ సీతారామంలో చోటుచేసు కుంది. తనను అల్లరిచేసే అమ్మాయిల మధ్యలో వుండి తనను అలరించే అందమైన అమ్మాయి జాడ లేకుండా పోయింది. చీకటిలో తారలా తళుక్కుమనే ఆమె కళ్ళు, మలయమారుతంలా తాకి తనను పులకింపచేసే మధువులొలుకు ఆమె దరహాసం కాన రాకుండా పోయాయి. ఆమె కోసం ప్రతి ఉదయం ఎదురుచూసేవి అతని కళ్ళు. ఆమె కనరాక నిరాశగా బరువెక్కేవి. తనను యిబ్బందిపెట్టే అమ్మాయిల మధ్యలో తనను అలరించే అతివ ఒకామె వుందని గ్రహించేసరికి చాలా ఆలస్యమైందని గ్రహించాడు సీతారామం. ఆమె లేని లోటు అతనిలో కలవరాన్ని రేపింది. ఆమె కనపడకపోవటం అకాల సూర్యాస్త మయంలా అన్పించింది.

ఆమెను తన తలపులలో బంధించాలని చాలా కాలం ప్రయత్నించాడు. కాని జీవన పరిభ్రమణంలో ఎన్నో కొత్త మార్పులు చోటుచేసుకుని ఆమె తాలూకు స్మృతులను మరుగుపరిచాయి.

ఇప్పుడిలా దర్శనం ఇచ్చి తిరిగిఅతని జీవితంలో వ సంతాన్ని ఉదయింపచేసింది ఆమె.

* * *

## ఖండన!

నా దేశపుయోధులు
గడ్డిపోచకు గూడా హాని చేసే హక్కు
కలిగి వుండడాన్ని నేను అంగీకరించను
పిల్లలు
బాంబులు విసరాలనే హక్కు కలిగి వుండడాన్ని
నేను అంగీకరించను
నా చెల్లెలు
ఓ పురుషునిపై తుపాకీ గురి పెట్టడాన్ని
గూడా నేను అంగీకరించను
మీకిష్టమైనవన్నీ నేను వ్యతిరేకిస్తాను. కానీ,
ఎన్నో వున్న ఆదర్శాలకు హామీ యెవరు ఇస్తారు?
హంతకుల గుర్రాలు ప్రక్కగా నడిచి వెళ్ళినప్పుడు
హతుల కళ్ళు ఎప్పుడు మూస్తాయో?
ఎవరు చెప్తారు?
పదియేండ్ల వయసుకే పిల్లవాడు
వీరుడుగా మారడాన్ని నేను తిరస్కరిస్తాను
చెట్ల బోదెలతో నిర్మింపబడ్డ ఆవాసగృహాలు
పేల్చడాన్ని గూడా నేను తిరస్కరిస్తాను
పండ్ల చెట్లకొమ్మలు ఉరికొయ్యలుగా
తయారవడాన్ని గూడా నేను తిరస్కరిస్తాను
నా తోటలోని గులాబి చతురస్రాలు
సైనిక నివాళులు అర్పించేందుకు
వినియోగించడాన్ని నేను తిరస్కరిస్తాను
మీకు ప్రియమైనవన్నీ నేను తిరస్కరిస్తాను... కానీ,

నా దేశం
నా స్నేహితులతో
యువ వీరులతో సహా
మాడిమసై పోయినప్పుడు
నా గీతాలు ఆయుధాలు కాకుండా
ఎలా వుండగలవు?

మూలం: రషీద్ హుస్సేన్

అనువాదం: కిరణ్‌బాబు

ఆక్రమిత ప్రాంతాలలో పాలస్తీనా కవిత్వోద్యమ సారథి, రషీద్ హుస్సేన్. పెన్ను, గన్ను పట్టినఆచరణశీలి రషీద్. రషీద్ హుస్సేన్ 1976 లో తన 40వ ఏట వీరమరణం చెందాడు.

పెళ్ళిచూపులయిన మరునాడు ఆమె తండ్రి సీతారామం తండ్రిని కలిశాడు. మా అమ్మాయి మీ అబ్బాయిని తప్ప మరెవ్వరినీ పెళ్ళాడనంటోందని, మీ అబ్బాయి కాదంటే మా అమ్మాయి ఏం అఘాయిత్యానికి పాల్పడుతుందో అని భయంగా వుందనీ వాపోయాడు. ఒక్క చిరునవ్వుతో ఆయన భయాన్ని పారద్రోలాడు సీతారామం తండ్రి.

"మీరేమీ గాబరా పడకుండా, ముందు స్థిమిత పడి, ఆ తరువాత వెచ్చటి కాఫీతో గొంతు తడుపు కోండి బావగారూ!" అంటూ మర్యాదాత్మక సంబోధనతో కళ్యాణ భేరి మ్రోగించాడు సీతారామం తండ్రి.

* * *

తొలినాటి రాత్రి.

సీతారామం గుండెలపై ఆమె తల వాల్చి వుంది. అతని గుండెలలో ఆమె తన స్థానాన్ని ఆప్యాయంగా చూసుకుంటోంది.

"నన్ను తప్ప మరెవరినీ పెళ్ళాడనన్నావట! నన్నే వరించటంలో నీ ఉద్దేశం తెలుసుకోవచ్చా?"

"చెప్పనా?"

"ఊ ..."

"నమ్ముతారా?"

"నమ్మనా మరి!"

"పెళ్ళిచూపులలో మిమ్మల్ని చూసినప్పుడు మీరు చాలా బుద్ధిమంతులనిపించింది. మీ ముఖం చూడగానే నాకు అణకువగా పడివుండే వ్యక్తిలా అన్పించారు. నేను ఉద్యోగం పని మీద వెళ్ళేటప్పుడు వంట చేసి పెట్టాలన్నా; నేను మహిళామండలికి వెళ్ళినప్పుడు యిల్లు జాగ్రత్తగా చూసుకుంటూ కూర్చోవాలన్నా; రేపు మనకి పిల్లలు పుడితే వాళ్ళ ఆలనా పాలనా చూసుకోవాలన్నా మీరే తగినవారు అనిపించింది. అందుకే మిమ్మల్ని స్వయంగా వరించి కోరుకున్నాను."

ఆమె మాటలు విన్న సీతారామం ముఖం పాలిపోయింది. తనను అంత చవకబారుగా అంచనా వేసిందనుకోలేదు. తన ఊహలు తారుమారయ్యాయ్ అని విచారంలో మునిగిపోయాడు. అమావాస్య రాత్రిలా మాడిపోయిన అతని ముఖంలో ఉక్రోషం ఉదయించింది.

అతని స్థితి ఆమెకు అర్థం అయింది. పెల్లుబకబోతున్న నవ్వుల సెలయేటిని పంటితో పెదాల వద్ద నొక్కిపట్టలేక ఘోరంగా విఫలమయింది.

సీతారామానికేం అర్థంకాక అయోమయంలో పడ్డాడు.

కొన్ని క్షణాల తరువాత ఆమె నిదానించుకొని తనలోని అసలు భావాలను చెప్పటం మొదలు పెట్టింది.

"క్షమించండి. మిమ్మల్ని ఆట పట్టించాలని అలా అన్నానే కాని, నా వుద్దేశం మాత్రం అది కాదు. ఆడపిల్ల చిరునవ్వుని వక్రంగా అర్థం చేసుకొని ఆమెతో ప్రేమలోపడే సినీమోజు కుర్రవాళ్ళను చూశాను. ఆడపిల్లను చాలా చీప్‌గా ట్రీట్ చేసి వెకిలి వేషాలు వేసే జులాయివాళ్ళను చూశాను. కానీ మేమంతా ఆ రోజుల్లో మిమ్మల్ని ఆట పట్టిస్తుంటే మీలో కనిపించే అమాయకత్వానికీ, నిర్మలత్వానికీ నేను ముగ్ధురాలనయ్యాను. మిమ్మల్ని అభిమానించాను, ప్రేమించాను. కాని నా మదిలో భావాలు కలలుగా మాత్రమే మిగిలిపోయాయి. అనుకోని విధంగా మా నాన్నగారికి ఏలూరు బదిలీకావటంతో నా ఊహా ప్రపంచం చెదరిపోయింది.

దైవం అనుగ్రహించి మనం పెళ్ళిచూపులలో కలిశాం. మిమ్మల్ని చూడగానే నేను ఎంతో పొంగిపోయాను. ఎలాగైనా మిమ్మల్ని పెళ్ళాడాలనుకున్నాను. లేకపోతే ప్రాణత్యాగానికైనా సరే సిద్ధపడతానని మా నాన్నను బెదిరించాను.

మీరు నన్ను ఆనాటి అల్లరి పిల్లగా ఊహించుకొని పెళ్ళాడనంటారని భయపడ్డాను. కాని నా కలలు నిజం చేసి నా కొంగు తీయని వరాన్నిచ్చారు. థాంక్స్."

ఆమె మాటలు విన్న సీతారామం తృప్తిగా నిట్టూర్చాడు.

"కానీ నేను అప్పటి సీతారామాన్ని కాదు. పూర్తిగా మారిపోయాను."

ఆమె ఆశ్చర్యంగానూ, ఆందోళనతోనూ అతని కళ్ళల్లోకి చూసింది.

"నిజం. నేను మారిపోయాను. అప్పుడు నేను బ్రహ్మచారిని, అమాయకుణ్ణి. ఇప్పుడొక అందాల బొమ్మ వరించిన వాణ్ణి. గడుసరి భార్యతో సంసారం చేయాలంటే అంతకంటే గడుసరిగా వుండాలని గ్రహించినవాణ్ణి. సారీ... గడుసరివాణ్ణికాక తప్పడం లేదు."

అతని చమత్కారాన్ని గ్రహించింది ఆమె.

అతని కళ్ళల్లోకి చూస్తున్న ఆమె కళ్ళు సిగ్గుతో బరువెక్కి క్రిందికి వాలాయి. "సరిసరీ... గడుసరీ" అంటున్నట్టున్నాయి. ◆

చలాన్ని సుబ్రహ్మణ్యం సీరియల్.
క్రైమ్ రిపోర్టర్
త్వరలో!